క్లుప్తంగా

తాడికొండ మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా అబ్దుల్ ఖాదర్



తాడికొండ: తాడికొండ నియోజకవర్గ మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా సయ్యద్ అబ్దుల్ ఖాదర్ జిలానీను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. మేడికొండూరు మండలం ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన అబ్దుల్ ఖాదర్ జిలానీకి పదవి కేటాయించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో పదవి కేటాయించినందుకు నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతూ పార్టీ విజయానికి కృషి చేసి రాబోయే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేస్తానని తెలిపారు.

మండల స్థాయి సమీక్ష

దుగ్గిరాల: వ్యక్తిగత రుణాలు, మీటింగ్ పుస్తకాల నిర్వహణ, బ్యాంకు లింకేజీ రుణాలపై సమీక్ష మండల సమాఖ్య ఆధ్వర్యాన జరిగింది. శనివారం మండల కేంద్రంలోని దుగ్గిరాల మండల పరిషత్ సమావేశ మందిరంలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మండలస్థాయి సమావేశం నిర్వహించారు. ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లో వీవోఏలు నిర్వహించే పుస్తకాలు, మీటింగు తీర్మానాలు నిర్వహణ ఎలా నిర్వహించాలో తెలియజేశారు. కార్యక్రమంలో కిరణ్‌కుమార్, అశోక్‌కుమార్, కేశవ్‌కుమార్, శివప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిల్వ నీటితో అనర్థం

ఫిరంగిపురం: నీరు నిల్వ లేకుండా చూడాలని సత్తెనపల్లి మలేరియా సబ్ యూనిట్ అధికారి చంద్రశేఖర్ అన్నారు. రేపూడి సబ్‌సెంటర్, కాలనీ ప్రాంతాల్లో శనివారం డ్రైడే, పారిశుధ్యకార్యక్రమాల పనితీరు పరిశీలించారు. రేపూడికాలనీలో నీటితొట్లు, సిమెంటు గాబులు, నీటి పీపాలు పరిశీలించి వాటిలో దోమలు గుడ్లు పెట్టకుండా ఉండటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. నీటి తొట్లపై తప్పనిసరిగా మూతలు పెట్టాలన్నారు. ఇంటి ఆవరణలో ఉన్న పాత టైర్లు, కొబ్బరిబొండాల్లో వర్షం నీరు చేరకుండా చూసుకోవాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచితే వ్యాధులు దరిచేరవన్నారు. నిల్వ నీటిలో ఆరోగ్యసిబ్బందితో ఎబెట్ ద్రావణాన్ని చల్లించారు. ఆశా కార్యకర్తల రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎస్ జె.బాబురావు, ఎంఎల్‌హెచ్‌పీ సువర్ణ, ఏఎన్ఎం లలితకుమారి, ఆశా కార్యకర్త లక్ష్మి పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ పుస్తకాల పంపిణీ

దుగ్గిరాల: మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు సహకారంతో 8వ తరగతి విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ పుస్తకాలు పంపిణీ చేశామని హెచ్ఎం బి.వి. కృష్ణారావు తెలిపారు. శనివారం రేవేంద్రపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 25 మంది విద్యార్థులు పోటీ పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. వారికి అవసరమైన ఎన్ఎంఎంఎస్ పుస్తకాలు పంపిణీ చేశామన్నారు. ఎన్‌సీసీలో పాఠశాల విద్యార్థులు 50 మంది బాలబాలికలు 22 (ఎ) బెటాలియన్ ఆధ్వర్యంలో నూతనంగా చేరారన్నారు.

ఘనంగా గ్యార్మీ వేడుకలు



తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని కొలనుకొండలో శనివారం గ్యార్మీ పండుగ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు నూతక్కి శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు చేశారు. గార్మీ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులు జెండాలను ప్రత్యేకంగా అలంకరించారు. నూతక్కి శ్రీనివాసరావుతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు ముస్లింలకు గ్యార్మీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నేత శిఖా నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు షేక్ రబ్బానీ, షేక్ ఖాజా, షేక్ జిలానీ, షేక్ ఇబ్రహీం, కరీముల్లా, రబ్బానీ, మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

క్రిస్టియన్, ముస్లిం, దళితులపై దాడులను అరికట్టాలి

మంగళగిరి టౌన్: క్రిస్టియన్, ముస్లిం, దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని క్రిస్టియన్, ముస్లిం, దళిత ఫ్రంట్ (సీఎంపీఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దిశెట్టి అజయ్‌బాబు అన్నారు. మంగళగిరి పట్టణ పరిధిలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అజయ్‌బాబు మాట్లాడుతూ క్రిస్టియన్, ముస్లిం, దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టి రాజ్యాధికారం వైపు సీఎండీఎఫ్ ముందుకు వెళ్లాలనే ఆలోచనా శక్తితో సంస్థను స్థాపించామన్నారు. ఉభయ రాష్ట్రాల్లో గ్రామస్థాయి నుంచి కమిటీలు వేసి సీఎండీఎఫ్‌ను బలోపేతం చేసి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. అనంతరం ఏపీ అధ్యక్షులు సాధనాల రాజాజీ, అజయ్‌బాబులు.. నూతక్కి కృష్ణ రేఖను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో తెలంగాణ అధ్యక్షులు ప్రసాద్, ముస్లిం మైనార్టీ నాయకులు యూసఫ్, మాజీ మేయర్ గ్రిటన్, క్రిస్టియన్ వెల్ఫేర్ ప్రొడక్షన్స్ ఫోరం అధ్యక్షులు పాస్టర్ పాతూరి సహదేవ్, ఎస్సీ ఎస్టీ రాష్ట్ర కార్యదర్శి కారుమంచి రామారావు, మాచర్ల ఏసోబు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులపై జర్నలిస్టుల ఆగ్రహం

- పత్రికా స్వేచ్ఛపై దాడి తగదంటూ ఆందోళన
- పాత్రికేయులపై వేధింపులు ఆపాలని డిమాండ్
- మంగళగిరిలో అధికారులకు వినతిపత్రం అందజేత



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న మంగళగిరి నియోజకవర్గ జర్నలిస్టులు

మంగళగిరి టౌన్: అక్షరానికి అండగా, సత్యానికి తోడుగా పాత్రికేయ వర్గాలు అడుగు కదిపాయి. అవినీతి, అక్రమాలను వెలుగులోకి తెస్తున్న 'సాక్షి'పై కూటమి సర్కార్ జులుంపై కలం వీరులు కన్నెర్ర చేశారు. అక్రమ కేసులతో పాత్రికేయులను భయపెట్టలేరని స్పష్టం చేశారు. పాలకులు పోలీసులను ఉసిగొల్పి వేధించడాన్ని తప్పుబట్టారు. సాక్షి ఎడిటర్ ఆర్. ధనంజయరెడ్డిపై, పలువురు రిపోర్టర్లపై తరచూ విచారణలో ఆధారాలు ఇవ్వాలంటూ వేధించడాన్ని జర్నలిస్టులు దుయ్యబట్టారు. పాత్రికేయులపై వేధింపులు ఆపాలంటూ డిమాండ్ చేశారు. తీరు మార్చకపోతే జర్నలిస్టు సంఘాలు ఏకమై ప్రజా సంఘాలతో కలసి పోరాటం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

సర్కార్‌పై జర్నలిస్టుల గర్జన

మంగళగిరిలో శనివారం జర్నలిస్టులు మీడియా స్వేచ్ఛను హరిస్తున్న సర్కార్‌పై గర్జించారు. నగర పరిధిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిరసనలో మీడియాపై దాడి సిగ్గు సిగ్గు... పత్రికా స్వేచ్ఛను కాపాడాలి... పోలీసుల జులుం నశించాలి... సర్కార్ కక్షసాధింపు చర్యలు ఆపాలి అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం నినాదాలతో గౌతమబుద్ధ రోడ్డు మీదుగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి డెప్యూటీ తహసీల్దార్ అంకారావుకు వినతి పత్రం అందజేశారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే..

ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ ప్రజాపక్షంగా నిలిచే పత్రికల గొంతు నొక్కేయడం అంటే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనన్నారు. వార్తలు సహేతుకంగా లేవని భావిస్తే న్యాయస్థానాన్ని ఆశ్రయించడం ప్రజాస్వామ్య పద్ధతి అని, ప్రభుత్వం ఆ మార్గాన్ని పక్కన పెట్టి అక్రమ కేసులు పెట్టి మీడియాపై దాడులు చేయడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. పత్రికా స్వేచ్ఛను కాపాడేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కోరుతూ అధికారులకు వినతిపత్రాలు అందజేశామని తెలిపారు.

నిరసనలో మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల జర్నలిస్టులు బందెల దయాకర్, బత్తుల సాంబ శివరావు, షేక్ సుభాని, ఎం.మస్తాన్, విడేల వాసు, కిషోర్, శివనాగిరెడ్డి, అభిరామ్ కృష్ణారెడ్డి, చిన్ని, రాజు, నారాయణ, రాంబాబు, సీహెచ్ కల్యాణ్, నాగరాజు, ఆనంద గుప్తా, దుర్గారావు, టి. శివనాగిరెడ్డి, జొన్న వెంకట్, చినబాబు, కనకరాజు, తంగెళ్లమూడి శ్రీనివాసరావు, వేణుగోపాల్, యలమందరావు, రత్నారావు తదితరులు పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛను హరించడమే



ప్రభుత్వ వైఫల్యాలపై పత్రికలలో కథనం ప్రచురించారని పత్రికా కార్యాలయాలపై దాడి చేయడం, కేసులు బనాయించడం మీడియా స్వేచ్ఛను హరించడమే. ఉన్న విషయాలను వెలికితీసేది పత్రికలే. ఆ పత్రికలే లేకపోతే దేశంలో అన్యాయాలు, అక్రమాలు ఎక్కువ అవుతాయి. పత్రికలపై దాడిచేయడం అంటే ప్రజావ్యవస్థపై దాడి చేయడమే. పత్రికల్లో వచ్చిన కథనాల్లో అభ్యంతరాలు ఉంటే న్యాయబద్ధంగా ఎదుర్కోవాలే తప్ప ఇలా వ్యవహరించడం సరి కాదు. ఇలాంటి చర్యలను ఖండిస్తున్నాం.

–కారుమంచి రామారావు, ఎస్సీ ఎస్టీ రైట్స్ అండ్ యాక్ట్స్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ

అప్రజాస్వామికం



భారత రాజ్యాంగ వ్యవస్థకు తూట్లు పొడుస్తూ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోంది. పత్రికా స్వేచ్ఛను అణచివేసేందుకు సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డిపై కేసులు పెట్టి ఒత్తిడికి గురిచేస్తోంది. పత్రికా స్వేచ్ఛను హరించే రీతిలో నోటీసులు ఇవ్వడం అప్రజాస్వామికం. విలేకరులపై పెట్టిన కేసులన్నింటినీ ఎత్తివేయాలి. ప్రజాస్వామ్యంలో మీడియా స్వేచ్ఛను కాపాడాలి. జర్నలిస్టులను, మీడియా సంస్థలను ఇబ్బంది పెట్టే విధానం మానుకోవాలి.

–కె. బాజీ గంగాధరరావు, వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా స్పోక్స్ పర్సన్

పత్రికల గొంతు నొక్కడం అన్యాయం



కూటమి ప్రభుత్వం పత్రికల గొంతు నొక్కేందుకు ప్రయత్నిస్తోంది. ప్రభుత్వం పోలీసుల అండగా పత్రికా స్వేచ్ఛను హరిస్తోంది. పత్రికా స్వేచ్ఛ లోపించిన ప్రజాస్వామ్యం ప్రమాదకరంగా మారుతుంది. పత్రికల్లో వార్తలు రాశారని కేసులు నమోదు చేయడం పాత్రికేయుల నైతిక బలాన్ని హరించడమే. వార్తలతో మనోభావాలు దెబ్బతిన్నాయని భావిస్తే కౌంటర్ వివరణ ఇవ్వాలి. అంతేగానీ ఇలా బెదిరింపు ధోరణితో వ్యవహరించడం సరికాదు. గతంలో ఇలాంటి సంస్కృతి లేదు.

–కలకోటి సునీల్ కుమార్, న్యాయవాది, వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ లీగల్‌సెల్ అధ్యక్షుడు

వ్యక్తి అదృశ్యం

మంగళగిరి టౌన్: వ్యక్తి అదృశ్యంపై మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం రాత్రి కేసు నమోదైంది. మంగళగిరి బ్యాంక్‌కాలనీలో నివసిస్తున్న బొద్దాని ఉషకు ఇద్దరు సంతానం. ఉష కుమారుడైన బొద్దాని శ్రీను భార్యతో గొడవలు పడి కొంతకాలంగా తల్లి ఉష వద్దే ఉంటూ వంటపనులకు వస్తూ ఉండేవాడు. గత నెల 10వ తేదీ ఉదయం 6 గంటలకు సిమెంట్ పని నిమిత్తం మంగళగిరి పాతబస్టాండ్ వద్దకు వెళ్లాడు. తిరిగి సాయంత్రం ఇంటికి రాలేదు. రెండు రోజుల తర్వాత ఫోన్ చేసి వేరే వద్ద సిమెంట్ పనులు చేసుకుంటున్నాను అని చెప్పాడు. ఈ క్రమంలో సెప్టెంబర్ 21న గ్యాస్ అయిపోయిందని, డబ్బులు వెయ్యాలని చెప్పగా వెయ్యి రూపాయలు ఫోన్‌పే చేశాడు. ఆ తరువాత రోజు ఫోన్ చేస్తే తన కుమారుడి ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోందని తల్లి ఉష పేర్కొంది. బంధువులను, తెలిసిన వారిని విచారణ చేయగా తన కుమారుడికి ఆచూకీ లభ్యం కాకపోవడంతో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం రాత్రి ఫిర్యాదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. శ్రీను వయస్సు 31 సంవత్సరాలని, ఎత్తు 5 అడుగుల 4 అంగుళాలని, తెలుపురంగులో ఉంటాడని, జుట్టు లైట్ ఎరుపురంగులో ఉంటుందని ఫిర్యాదులో పేర్కొంది. ఉష ఫిర్యాదుపై పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

నాయకత్వ లక్షణాలు పెంపునకు కృషి

మందడం(తాడికొండ): విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించి, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగే పలు అంశాలపై అవగాహన పెంపొందించేందుకు చిల్డ్రన్స్ పార్లమెంటు ఎంతగానో దోహదపడుతుందని గుడ్‌షెపర్డ్ కాన్వెంట్ సిస్టర్ నీరజ అన్నారు. తుళ్లూరు మండలం మందడం, అబ్బరాజుపాలెం గ్రామాల్లో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం చిన్నారులతో బాలల పార్లమెంటు ఏర్పాటు చేసి ప్రమాణ స్వీకారోత్సవం చేశారు. కో ఆర్డినేటర్లు అనూష, నాగమణి, ఇజ్రాయెల్, మహిళా పోలీస్ జయవర్ధిని తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత



స్వచ్ఛాంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న జోసిల్ సిబ్బంది



మంగళగిరిలో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న అనిల్‌కుమార్‌రెడ్డి

ఫిరంగిపురం: స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని ఎమ్మెల్యే టి.శ్రావణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం స్వచ్ఛాంధ్ర– స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా సెయింట్ ఆన్స్ పాఠశాలలో మొక్కలు నాటారు. గాంధీబొమ్మ సెంటర్లో వీధులు శుభ్రం చేశారు. ప్రధాన వీధుల్లోని పలు దుకాణదారులకు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ కవర్లకు బదులుగా ఫాబ్రిక్, పేపర్, వుడ్‌తో తయారుచేసిన సంచులు వాడుకోవాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ కాలుష్య నివారణకు కృషి చేయాలని తెలిపారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

మేడికొండూరు: నరసరావుపేటరోడ్డు డోకిపర్రు జోసిల్ కంపెనీలో శనివారం ఘనంగా స్వచ్ఛ ఆంధ్ర దినోత్సవం జరిగింది. గుంటూరు జిల్లా ఫ్యాక్టరీ తనిఖీ ఉప శాఖ అధికారి ఆదేశాల మేరకు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కంపెనీ సెక్రెటరీ కోట రఘురాం మాట్లాడుతూ మానవ జీవితానికి పరిసరాల పరిశుభ్రత చాలా అవసరమన్నారు. అడ్వైజర్ యడ్లపాటి భాను ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా జోసిల్ కంపెనీ సిబ్బంది కార్మికులు స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కంపెనీ అడ్వైజర్ రామినేని బెనర్జీ బాబు, వివిధ విభాగాల ఇంజినీర్లు, ఇన్‌చార్జిలు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల: స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్రలో ఈ నెల స్వచ్ఛమైన గాలి ఆరోగ్యకరమైన జీవితం అనే థీమ్ ప్రభుత్వం ఇవ్వడంతో విద్యార్థులు, అధికారులతో కలిసి నిర్వహించామని ఎంపీపీ షేక్ జబీన్ తెలిపారు. శనివారం దుగ్గిరాల మండలం ఈమని, దుగ్గిరాల పాత లాకుల వద్ద పిచ్చి మొక్కలు తొలగించి పార్క్ పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో మండల అధికారులు, పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది, డాక్టర్ కె.ఆర్.ఎం డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడండి

తాడేపల్లిరూరల్ / మంగళగిరి టౌన్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో తాడేపల్లి మున్సిపల్ కార్యాలయం వద్ద శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి బోసుబొమ్మ సెంటర్ వరకు విద్యార్థినీ విద్యార్థులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా స్వచ్ఛాంధ్ర మేనేజింగ్ డైరెక్టర్ అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధించి పర్యావరణాన్ని కాపాడాలని, మొక్కలు నాటి కాలుష్యాన్ని అరికట్టాలని పిలుపునిచ్చారు. దీపావళి పండుగ రోజున వాయు, శబ్ద కాలుష్యం లేకుండా పండుగను జరుపుకోవాలని సూచించారు. ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాల ద్వారా ప్రజలకు పలు కార్యక్రమాలతో పచ్చదనం పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. మంగళగిరి లక్ష్మీ నరసింహ స్వామి కళావేదికలో మోడల్‌ప్రాజెక్టులు, ఎగ్జిబిషన్ స్టాల్స్, డ్రాయింగ్ చార్ట్స్ ఏర్పాటు చేశారని, పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశామన్నారు. మంగళగిరి, తాడేపల్లిలో స్వచ్ఛమైన గాలి మన హక్కుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంటీఎంసీ అడిషనల్ కమిషనర్ శకుంతల, అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, టీటీడీ సభ్యుడు తమ్మిశెట్టి జానకీదేవి, తాడేపల్లి జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు భీమిరెడ్డి తాతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మణిపాల్‌లో మరో రికార్డు



వర్క్‌షాప్‌లో పాల్గొన్న వైద్యులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లిలోని మణిపాల్ హాస్పిటల్ మరోసారికొత్త రికార్డు సృష్టించినట్లు శనివారం మణిపాల్ వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా హాస్పిటల్ మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ కన్సల్టెంట్ డాక్టర్ బత్తిని రాజేష్ మాట్లాడుతూ అన్నవాహికలో సమస్యతో మింగడంలో ఇబ్బంది కలిగించే అకలాసియా కార్డియా అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్న రోగుల కోసం 200 పెర్ ఓరల్ ఎండోస్కోపిక్ మైటోమీ (పి.ఓ.ఇ.ఎమ్) ప్రొసీజర్లను విజయవంతంగా పూర్తిచేశామని తెలిపారు. ఈ విజయానికి ప్రతీకగా పీఓఈఎం ప్రొసీజర్స్‌పై మణిపాల్ హాస్పిటల్ ఒక ప్రత్యేకమైన వర్క్‌షాప్, కాన్ఫరెన్స్‌ను ఏర్పాటు చేసిందని, ఈ కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 15 మంది ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టులు హాజరయ్యారని పేర్కొన్నారు. ఇది ఎక్కువగా 30 నుంచి 60 ఏళ్ల మధ్యలో వారికి వచ్చే సమస్య అని తెలిపారు. ఈ విజయంతో గ్యాస్ట్రో ఎంట్రాలజీ, లివర్ ట్రాన్స్‌ప్లాంట్ విభాగం జీర్ణవ్యవస్థ సంక్లిష్ట వ్యాధులపై దృష్టి సారించే ప్రత్యేక రంగంగా మారింది. ఇందులో మినిమల్లీ ఇన్వాసివ్, రోబోటిక్ సర్జరీ వంటి అధునాత పద్ధతులు ఉన్నాయని స్పష్టం చేశారు.

సేవలు మెరుగుపరచడమే 'స్మార్ట్' లక్ష్యం

తాడికొండ: భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని సేవలు మెరుగుపరచడమే స్మార్ట్ సిటీల లక్ష్యమని అడ్వాన్స్‌డ్ ఇన్నోవేషన్ అంబాసిడర్ ప్రొఫెసర్ డాక్టర్ మానికొండ శ్రీనివాస శేషసాయి అన్నారు. మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్–వాణి పథకంలో భాగంగా రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. స్మార్ట్ సిటీస్‌కు 7 మూల స్తంభాలైన స్మార్ట్ లివింగ్, స్మార్ట్ పీపుల్, స్మార్ట్ ఎకానమీ, స్మార్ట్ గవర్నెన్స్, స్మార్ట్ మొబిలిటీ, స్మార్ట్ ఎన్విరాన్‌మెంట్‌లపై వివరించారు. మరో అతిథి సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కోయి లక్ష్మీ ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నాగ శ్రీనివాసరావు, డీన్‌లు డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ బాలమురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీని నెరవేర్చాలి

తాడేపల్లిరూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీని నెరవేర్చాలని యూనియన్ నేత స్టీవెన్ అన్నారు. శనివారం బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికుల దీక్షలను యూనియన్ నాయకులు ఆదినారాయణ, నాగేశ్వరరావు, సాంబశివరావు, వెంకటేశ్వరరావుతో కలసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు నారా లోకేష్‌కు కార్మికులు వారి సమస్యను విన్నవించుకున్నారని గుర్తు చేశారు. లోకేష్ కార్మికుల సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారన్నారు. కార్మికులు హనుమంతరావు, సుభాని, ఆశీర్వాదం, రమాదేవి, శారమ్మ, ఇమాంబీ తదితరులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడి హేయం

దుగ్గిరాల: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడి అత్యంత హేయమైన చర్య అని భారత ప్రజాస్వామ్య లౌకిక రాజ్యాంగ పరిరక్షణ సమితి అధ్యక్షుడు షేక్ సుభాని ఖండించారు. శనివారం దుగ్గిరాలో ముర్తుజానగర్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీజేఐపైనే దాడి జరిగితే సాధారణ ప్రజలకు ఏమి రక్షణ ఉంటుందన్నారు. దాడికి పాల్పడిన రాకేష్ కిషోర్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సుభాని, కుమార్ పాల్గొన్నారు

అధునాతన బోధనపై అవగాహన

మేడికొండూరు: మండలంలోని విశదల అడ్డ రోడ్డు వద్ద ఎన్నార్ఐ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం అధునాతన బోధన విధానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కళాశాల చైర్మన్ డాక్టర్ ఆలపాటి రవీంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో బోధన సిబ్బందికి, అధునాతన బోధనా విధాన ప్రాముఖ్యాన్ని వివరించారు. మారుతున్న ఆధునిక సాంకేతిక విజ్ఞానం అందిపుచ్చుకొని విద్యార్థుల్లో జ్ఞానాన్ని పెంపొందించాలన్నారు. విద్యార్థులు విద్యను ప్రయోగాత్మకంగా ఎలా ఉపయోగిస్తారో ఎంతవరకు ప్రయోజనకరంగా ఉంటుందో అవగాహన కల్పిస్తే ఆలోచన విధానం, నేర్చుకోవాలనే తృష్ణ పెరుగుతుందన్నారు. వన్ అవర్ క్లాస్ బోధనలో చివరి ఐదు నిమిషాలు మనం చెప్పిన క్లాసులు సమ్మరీ రాయించి పరీక్షిస్తే మన బోధన ఎంతవరకు ప్రయోజనకరంగా ఉందో తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శరత్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిలక్ బాబు, కళాశాల ప్రిన్సిపాల్ సంజయ్, బోధన, బోధ నేతర సిబ్బంది వివిధ శాఖాధిపతులు ఏవో బి.సీతా రామయ్య తదితరులు పాల్గొన్నారు.

బావిలో జారిపడి వ్యక్తి మృతి

మంగళగిరి టౌన్: బావిలో జారిపడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళగిరి మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. మంగళగిరి మండలం కురగల్లు గ్రామానికి చెందిన కట్టెపోగు సురేంద్ర (32) నీరుకొండలో వీఆర్‌ఏ. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రెండేళ్ల క్రితం సురేంద్ర తండ్రి అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ ఉద్యోగాన్ని అతనికి కేటాయించారు. ఉద్యోగం రాకముందు కొంత పొలం కౌలుకు తీసుకుని అప్పుల పాలైనట్లు సురేంద్ర భార్య అరుణ తెలిపారు. ఆర్థికఇబ్బందులు, తల్లిదండ్రులు చనిపోవడంతో మానసిక క్షోభకు గురై బాధపడుతూ ఉండేవాడని ఆమె తెలిపింది. శుక్రవారం మధ్యాహ్నం సమయంలో ఇంట్లో నుంచి డ్యూటీకి వెళ్లాడని తెలిపారు. బంధువులు నీ భర్త సురేంద్ర సమీపంలోని మల్లెతోటలో ఉన్న బావిలో పడి చనిపోయినట్లు తెలిపాడని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా అప్పుల బాధతో చనిపోయేంత పిరికివాడు కాదని, గతంలో ఒక ప్లాట్ అమ్మి కొన్ని అప్పులు తీర్చాడని, కేవలం మనశ్శాంతి కోసమే ఆ బావి దగ్గర కూర్చోవడానికి వెళ్తుంటాడని పేర్కొన్నారు. ప్రమాదవశాత్తు బావిలోపడి ఉండొచ్చని తన భర్తకు ఈత రాదని ఫిర్యాదులో పేర్కొంది. ఫిర్యాదు మేరకు మంగళగిరి రూరల్ పోలీసులు అండర్ సెక్షన్ 194 బీఎన్ఎస్ఎస్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వమే మెడికల్ కళాశాలలు నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి



మండల పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న పోలారెడ్డి

తాడేపల్లిరూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్మించిన మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేస్తోందని, దానికి వ్యతిరేకంగా ప్రజలందరూ సంఘటితమై పోరాడాలని వైఎస్సార్‌సీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి అన్నారు. శనివారం తాడేపల్లి పట్టణపరిధిలోని కేఎల్ రావు కాలనీలో వార్డు అధ్యక్షులు చిన్నం అనిల్ అధ్యక్షత కోటి సంతకాల సేకరణపై విస్తృత సమావేశాన్ని నిర్వహించారు. వేణుగోపాల సోమిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వమే మెడికల్ కళాశాలలు నిర్వహించాలన్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా 15 మెడికల్ కాలేజీల నిర్మాణాన్ని చేపట్టి ఐదింటిని పూర్తిచేశారని, మరో రెండు కళాశాలలు పూర్తికావడానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. కూటమి కార్పొరేట్ సంస్థలకు, నాయకులకు మేలు చేసేందుకు ఈ ప్రైవేటీకరణ చేస్తోందని, దానికి వ్యతిరేకంగా ప్రజలందరూ ఉద్యమించాలని, పార్టీలకు అతీతంగా కోటి సంతకాలసేకరణను జయప్రదం చేయాలన్నారు. పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు చిలుకోటి శ్రీనివాస మధు, సీనియర్ నాయకులు తమ్మా రామిరెడ్డి, సుదర్శన్ తదితర నాయకులు పాల్గొన్నారు.

'కోటి సంతకాలు' విజయవంతం చేద్దాం

తాడికొండ: కోటి సంతకాల కార్యక్రమాన్ని సమష్టిగా విజయవంతం చేద్దామని తాడికొండ మండలం వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వంగా పోలారెడ్డి సూచించారు. తాడికొండ అడ్డరోడ్డులోని మండల పార్టీ కార్యాలయంలో కోటి సంతకాల కార్యక్రమ నిర్వహణపై తాడికొండ మండలంలోని గ్రామపార్టీ అధ్యక్షులు జిల్లా, రాష్ట్ర, మండల, గ్రామ అనుబంధ విభాగాల నాయకులతో సమావేశం ఏర్పాటుచేశారు. ఆయన మాట్లాడుతూ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ చేసి చంద్రబాబు ప్రభుత్వం పేదవాడికి మెడికల్ విద్య, వైద్యం సుదూరం చేసేందుకు కుటిల యత్నాలు చేస్తోందన్నారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణతో పేదలకు జరిగే నష్టంపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఇందుకోసం ప్రతి గ్రామంలో కనీసం 500 మందితో సంతకాలు సేకరించి రాష్ట్ర వ్యాప్తంగా కోటి సంతకాలు సేకరించాలన్నారు. చంద్రబాబు ప్రభుత్వం పేద, మధ్య తరగతి విద్యార్థులకు వైద్య విద్యను, ఉచిత వైద్యాన్ని దూరం చేసే కుట్రలో భాగమే ఈ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ అని ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర విభాగం సంయుక్త కార్యదర్శి ముప్పాళ్ళ మనోహర్, జిల్లా పంచాయతీరాజ్ అధ్యక్షులు దాసరి రాజు, రాష్ట్ర ఎస్సీ విభాగం సంయుక్త కార్యదర్శి బాకి వెంకటస్వామి, మండల ఉపాధ్యక్షుడు నల్లిబోయిన శ్రీనివాసరావు, వివిధ అనుబంధ విభాగాల నాయకులు షేక్ అజీస్, గుంటి రఘువరన్, దమ్మాటి మోహనరావు, షేక్ బాబావలి, బొంతా శ్రీ కాంత్ యాదవ్, దొంతిరెడ్డి సీతారామిరెడ్డి, వడ్లమూడి రాజేంద్ర, షేక్ బాజీ, షేక్ సలీమ్ పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అరుదైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారికి సాయం



చిన్నారి కుటుంబ సభ్యులకు సాయం అందజేస్తున్న పాఠశాల యాజమాన్యం

మంగళగిరి టౌన్: అరుదైన వ్యాధితో బాధపడుతున్న ఓ చిన్నారికి మంగళగిరి పట్టణంలో ఉన్న ఓ పాఠశాల చేయూతనందించింది. మంగళగిరి పరిధిలోని సెయింట్ ఫ్రాన్సిస్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో చిన్నారి తల్లిదండ్రులకు శనివారం రూ.4 లక్షల విలువైన చెక్కును యాజమాన్యం అందజేసింది. పాఠశాల డైరెక్టర్ కేవీ ఫ్రాన్సిస్ మాట్లాడుతూ పల్నాడు జిల్లా నరసరావుపేట, పనసతోటకు చెందిన షేక్ యాసిన్, షేక్ సిరిల్ దంపతులకు 18 నెలల సుహమ్మద్ జ్యాయన్ అనే కుమారుడు ఎస్ఎంఏ (స్పైనల్ మసిలేటర్ ఆట్రోఫీ) అరుదైన వ్యాధితో బాధపడుతున్నాడు. ఇది 10వేల మందిలో ఒక్కరికి వచ్చే వ్యాధి అని పేర్కొన్నారు. దీనికి అవసరమైన ఇంజక్షన్‌ను అమెరికా నుంచి తెప్పించాలని, ఖరీదు సుమారు రూ.16 కోట్లు ఉంటుందని వైద్యులు తెలియజేశారు. చిన్నారి తల్లిదండ్రులు మానవతా దృక్పథంతో ఎవరైనా ముందుకు వచ్చి సాయం అందించాలని కోరారని తెలియజేశారు. ఈ మేరకు పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు మూడున్నర లక్షలు సేకరించగా, మిగిలిన రూ. 50 వేలు స్కూల్ యాజమాన్యం అందించిందని, మొత్తం కలిపి రూ. 4 లక్షలను బాలుడి తల్లిదండ్రులకు అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ షబానా ఫ్రాన్సిస్, వైస్ ప్రిన్సిపాల్ రజియా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.